# జనం గుండెల నిండా..
# గులాబీ జెండా

- గులాబీ అభ్యర్థులకు భారీ మద్దతు
- అంతటా బ్రహ్మరథం పడుతున్న జనం
- స్వచ్ఛందంగా జై కొడుతున్న ప్రజానీకం
- కాంగ్రెస్, బీజేపీలను పట్టించుకోని జనం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా ప్రచారం



నిజామాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గులాబీ పార్టీకి కంచుకోట. ఆది నుంచి నేటి వరకు అన్ని ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీకే ఇక్కడి ప్రజలంతా జై కొడుతున్నారు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే తీరు ప్రస్ఫుటంగా కొనసాగబోతున్నది. నవంబర్ 30న జరిగే పోలింగ్‌కు భారత రాష్ట్ర సమితి సర్వంసన్నద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందు నుంచే ఎన్నికల కదనరంగంలో దిగి ప్రజల్లోకి వెళ్తున్నది. నిత్యం ప్రజల్లోనే ఉంటూ బీఆర్ఎస్ శ్రేణులంతా కారు గుర్తుకే ఓటేసే విధంగా ప్రజలను చైతన్యం చేస్తున్నారు. జోరుగా జరుగుతున్న ఎన్నికల ప్రచారంతో కాంగ్రెస్, బీజేపీలు డీలా పడిపోయాయి. అధినేత కేసీఆర్ ఆదేశాలతో ఎమ్మెల్యే అభ్యర్థులంతా జోరుగా ప్రచార పర్వాన్ని చేపడుతున్నారు. ఖాళీ సమయం అన్నది లేకుండా జనంలో కలియ తిరుగుతూ ప్రచారం కొనసాగిస్తుండడంతో ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా చేస్తున్నారు.

**ఎన్నికల హామీలపై వివరిస్తూ...**

బీఆర్ఎస్ ఎన్నికల హామీలపై ప్రజల్లో సానుకూల స్పందన కనిపిస్తున్నది. అక్టోబర్ 15న సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను కర పత్రాల రూపంలో ఇంటింటికీ బీఆర్ఎస్ కార్యకర్తలు చేరవేస్తున్నారు. మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత చేయబోయే కార్యక్రమాల సరళిని వివరిస్తూ గులాబీ దళం ముందుకు సాగుతున్నది. ఆసరా పింఛన్ల మొత్తం పెంపు, రైతుబంధు పెట్టుబడి సాయం రూ.16వేలు, కేసీఆర్ బీమా... ప్రతి ఇంటికి ధీమా వంటి విప్లవాత్మకమైన పథకాలపై ఇప్పటికే జనాల్లో చర్చ మొదలైంది. బీమా పథకంపై అందరిలోనూ ఆసక్తి పెరిగింది. మహిళా భృతి అంశంపైనా అనుకూలతలు ఏర్పడ్డాయి. మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులను ఇంటింటికెళ్లి ప్రచారం చేస్తున్నారు. గులాబీ శ్రేణుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంటున్నది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన అభ్యర్థులైతే కనీసం కదనరంగంలో అడుగు పెట్టి ఓట్లు అడిగే పరిస్థితి కూడా వారికి క్షేత్ర స్థాయిలో లేకపోవడం విడ్డూరంగా మారింది. జనం నుంచి బీఆర్ఎస్‌కు వస్తున్న స్పందనను చూసి ప్రతిపక్ష పార్టీలు కుదేలవుతున్నాయి.

**ముఖ్యమంత్రి రాకతో...**

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వయంగా గులాబీ దళపతి, సీఎం కేసీఆరే పోటీ చేస్తుండడంతో ఒక్కసారిగా పరిస్థితులు తారుమారు అయిపోయాయి. కామారెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్‌కు పెట్టని కోటగా నిలిచింది. అలాంటి గడ్డపై నుంచి స్వయంగా కేసీఆర్ వచ్చి పోటీ చేస్తుండడంతో ఉద్యమ కాలం నాటి సంగతులను ఇక్కడి ప్రాంత వాసులంతా గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నిలబెట్టడంలో ఉద్యమ కాలంలో కామారెడ్డి సైతం వేదికగా నిలిచింది. పెద్ద ఎత్తున ఉద్యమాలు జరగడానికి ఈ ప్రాంతం వేదికైంది. నాడు కేసీఆర్‌కు ఈ ప్రాంత ప్రజల మద్దతు పెద్ద ఎత్తున దక్కింది. ఇప్పుడు కూడా అదే స్థాయిలో ప్రజల మద్దతు ఉండబోతున్నది. ఇందులో భాగంగానే వందలాది గ్రామాల్లో స్వచ్ఛందంగా కేసీఆర్‌కు జై కొడుతూ కుల సంఘాల వారీగా తీర్మానాలు సైతం చేశారు. కేసీఆర్‌కే మూకుమ్మడిగా ఓట్లేసి గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ సైతం చేశారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు వరకు జీపీల వారీగా తీర్మానాలు జరిగాయి. ఏకబికిన మద్దతు రావడంతో ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా కుంగిపోవాల్సిన దుస్థితి ఏర్పడ్డది. కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేస్తున్నారన్న విషయం ఖరారు కావడంతోనే బీఆర్ఎస్ విజయం ఖాయమైందని మెజారిటీ కోసమే ప్రయత్నం జరుగుతుందంటూ అంతటా ప్రజలంతా గుసగుసలాడుకుంటున్నారు. ఇక కామారెడ్డి జిల్లాలో బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి విరామం లేకుండా ప్రజల మధ్యే తిరుగుతున్నారు. జుక్కల్‌లో హన్మంత్ షిండే, ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

**నిజామాబాద్‌లో జోరుగా ప్రచారం...**

నిజామాబాద్ జిల్లాలోనూ ప్రచార కార్యక్రమాలు వినూత్నంగా జోరుగా సాగుతున్నాయి. ఆర్మూర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్ రెడ్డి నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు గులాబీ పార్టీ విజయం కోసం జోరుగా ప్రచారం చేస్తున్నారు. వాహనాల ర్యాలీలతో పాటుగా సోషల్ మీడియాలోనూ జీవన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులపై పెద్ద ఎత్తున ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేస్తూ ఇంటింటికీ కేసీఆర్ పరిపాలన గొప్పతనాన్ని వివరిస్తున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పటికే జోరుగా ప్రచారం చేశారు. రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మాతృవియోగం కలగడంతో కాసింత బ్రేక్ పడింది. కొద్ది రోజుల్లోనే వేముల ప్రశాంత్ రెడ్డి సైతం ప్రచారానికి సిద్ధం అవుతున్నారు. ఇందుకు సంబంధించిన పకడ్బందీ కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ ఆయన భార్య ఫాతిమా ప్రచారం చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్‌లో ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా డివిజన్ల వారీగా ప్రచారం చేస్తుండడంతో పాటు కుల సంఘాలతో ప్రత్యేక భేటీలు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. నిజామాబాద్ రూరల్‌లోనూ జోరు కనిపిస్తోంది. నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా నియమితులైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైతం ప్రజల్లోకి వెళ్తున్నారు. తనదైన శైలిలో ప్రసంగిస్తూ జాతీయ పార్టీల తీరును ఎండగడుతూ బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను వివరిస్తున్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



పోలీసులకు సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

- ప్రజల్లో ఓటింగ్‌పై ఆత్మవిశ్వాసానికి పోలీసుల కవాతు
- పర్యవేక్షించి, సూచనలు చేసిన సీపీ కల్మేశ్వర్

శక్కర్‌నగర్, అక్టోబర్ 24: అసెంబ్లీ ఎన్నికల కోడ్‌లో భాగంగా బోధన్ పట్టణంలో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి సుమారు ఐదు వందల మంది పోలీసు బలగాలతో ప్రజలకు పోలింగ్‌పై ఆత్మవిశ్వాసం నింపేదిశగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ కల్మేశ్వర్ పలువురు స్థానిక పోలీసు అధికారులు, పోలీసులకు పలు సూచనలు చేశారు. ప్రజలు ఆత్మవిశ్వాసంతో, ఎలాంటి భయాలకు లోనుకాకుండా ఓటును సురక్షిత వాతావరణంలో వినియోగించుకునేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, వారిలో భరోసా నింపాలని సూచించారు. బోధన్‌లోని సున్నిత ప్రాంతాల గురించి స్థానిక ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కవాతును ప్రారంభించి, పాత బస్టాండ్, పోస్టాఫీస్, రెంజల్‌బేస్, తట్టికోట్, శక్కర్‌నగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా తిరిగి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగించారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ జైరాం, బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, పట్టణ, రూరల్ సీఐలు బీడీ ప్రేమ్ కుమార్, జి. శ్రీనివాసరాజుతో పాటు డివిజన్‌లోని పలువురు ఎస్సైలు, ఏఎస్సైలు, అదనపు పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

## ఎస్సారెస్పీ నుంచి కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల



మెండోరా, అక్టోబర్ 24 : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువలకు నీటి విడుదల కొనసాగుతున్నదని ఏఈఈ రవి తెలిపారు. కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని చెప్పారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌లోకి 199.883 టీఎంసీల వరద వచ్చిందని ఏఈఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1090.50 అడుగుల (87.561 టీఎంసీలు) నీటిమట్టం కలిగి ఉందని పేర్కొన్నారు.

## సోయా చోరీ చేశాడని..

- వ్యక్తిని అర్ధనగ్నంగా ఊరేగించిన గ్రామస్తులు
- పోలీసులకు ఫిర్యాదు

బోధన్ రూరల్, అక్టోబర్ 24: సోయాబీన్ చోరీ చేశాడంటూ ఓ వ్యక్తిని అర్ధనగ్నంగా ఊరేగించిన సంఘటన సాలూరా మండలంలోని హున్సా గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలాజీ అనే వ్యక్తి గ్రామంలోని అనేష్, నారాయణ అనే రైతులకు చెందిన సుమారు రెండు క్వింటాళ్ల సోయాబీన్ చోరీకి పాల్పడ్డాడని ఆరోపిస్తూ సోమవారం బాలాజీని రైతులు అర్ధనగ్నంగా ఊరేగించారు. అయితే బాలాజీ దళితుడు కావడంతోనే దొంగతనం కేసు అంటగట్టి ఇలా చేశారంటూ కొందరు యువకులు ఆందోళనకు దిగారు. కాగా, ఈ సంఘటనలో తనను అవమానించారంటూ బాలాజీ బోధన్ రూరల్ పోలీసులకు సాయంత్రం ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనలో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని బోధన్ రూరల్ సీఐ జి. శ్రీనివాస రాజు తెలిపారు.

## బాలికపై లైంగిక దాడి..

ఆర్మూర్, అక్టోబర్ 24 : ఆలూర్ మండల కేంద్రంలో 9 ఏండ్ల బాలికపై లైంగిక దాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన కొండపల్లి వెంకటేశ్ ఆదివారం లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో అక్కడ ఉన్న మరో చిన్నారి కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయమై బాలిక కుటుంబ సభ్యులు ఆర్మూర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు.

## భార్యను హతమార్చిన భర్త

**కుటుంబ కలహాలే కారణం**

నందిపేట్, అక్టోబర్ 24 : మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన నత్తి రోజా (35)ను ఆమె భర్త నత్తి సాగర్ హత్య చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోజా, సాగర్‌కు 13 ఏండ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెళ్లయిన నాటి నుంచే భర్త సాగర్, అత్త పెద్దమ్మి నిత్యం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవారు. ఇదే క్రమంలో రోజాను ఎలాగైనా హతమార్చాలని పథకం వేశారు. ఆదివారం అర్ధరాత్రి రోజా నిద్రిస్తున్న సమయంలో సాగర్.. రోజాను గొంతు నులిమి హత్య చేశాడు. ఈ మేరకు రోజా కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, JAIDI KARNA, H.No.1-56, Jakranpally, (D) Nzb. Changed my Name as JAIDI KARUNA W/o. JAIDI GANGAREDDY

NTZ-318443

**WANTED**

★రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.

NT-320535

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

GST వర్తించును

సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.